ప్రజాసమస్యలపై నిర్లక్ష్యం వహించొద్దు


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

ప్రజావాణి దరఖాస్తులు స్వీకరిస్తున్న జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్

• వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి, జూలై 1 : ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని, సత్వరమే పరిష్కరించి ఆన్‌లైన్‌లో ఆప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి హాల్‌లో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, నగేశ్‌లతో కలిసి ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత వారంలో వచ్చిన 107ఫిర్యాదుల్లో పరిష్కారం కాని వాటిపై శాఖల వారీగా వివరణ అడిగారు. వచ్చిన ఫిర్యాదులను రెండు రోజుల్లో పరిష్కరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రజావాణి మొత్తం 74 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు.

లే అవుట్ అనుమతులకు నిబంధనలు పాటించాలి

లే అవుట్ కోసం దరఖాస్తులు చేసుకున్న వారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని కలెక్టర్ తెలిపారు. లే అవుట్ల కోసం వచ్చిన నాలుగు దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ, రోడ్డు భవనాలు, పంచాయతీరాజ్, ఇరిగేషన్, టౌన్ ప్లానింగ్ శాఖలు సైట్ పరిశీలించి నిబంధనలకు లోబడి ఉన్నట్లయితే ఆన్‌లైన్ ద్వారా ఆమోదాన్ని తెలపాల్సి ఉంటుందన్నారు. దీనిలో అప్రోచ్ రోడ్డు 60 ఫీట్లు, 10శాతం ఖాళీ స్థలం ప్రభుత్వ పేరున గిఫ్ట్ డీడ్ చేసి సంబంధించిన పత్రాలు అందజేయాలన్నారు. వచ్చిన దరఖాస్తులలో సరైన పత్రాలు లేకపోవడంతో తదుపరి సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తతగా ఉండాలి

వర్షాకాలం ప్రారంభమైనందున జిల్లాలో డయేరియా, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా లైన్ డిపార్ట్‌మెంట్లు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి నెలా 1, 11, 21వ తేదీల్లో మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంక్‌లను శుభ్రపర్చడం, క్లోరినేషన్ చేయడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖాధికారి జయచంద్రమోహన్, మున్సిపల్ అధికారులు, పంచాయతీరాజ్ అధికారులు, విద్య సంక్షేమ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించాలి

జిల్లాలో పారిశ్రామిక రంగం అభివృద్ధికి ఔత్సాహికులను ప్రోత్సహించి, త్వరగా అనుమతులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ సురభి ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో టీజీ ఐపాస్‌పై సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి పరిచి ఉపాధి అవకాశాలు మెరుగు పర్చేందుకు చర్యలు తీసుకోవాలని లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులను ఆదేశించారు. పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకొనే ఔత్సాహికులకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, విద్యుత్, టౌన్ ప్లానింగ్, పరిశ్రమల శాఖల నుంచి త్వరగా అనుమతులు ఇవ్వాలన్నారు. ఇప్పటి వరకే బ్యాంకు రుణాలు పొంది వివిధ యూనిట్లు నెలకొల్పిన 13మంది ఎస్సీలకు రూ.3,46,500 సబ్సిడీ , 53మంది ఎస్టీలకు రూ.193,97,704, దివ్యాంగుడికి రూ.3,46,500 సబ్సిడీని కమిటీ ఆమోదం తెలిపిందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, నగేశ్, జిల్లా పరిశ్రమల అధికారి యాదగిరి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, విద్యుత్ శాఖ, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

• జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్

గద్వాల, జూలై 1 : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యం ఇస్తూ ఫిర్యాదులను త్వరగా పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంతోష్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 65ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి ఫిర్యాదులపై అధికారులు నిర్లక్ష్యం వహించొవద్దని సూచించారు. ఫిర్యాదులను అధికారులు పెండింగ్‌లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వాటి పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. ప్రజావాణి దరఖాస్తుల పై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. మీ పరిధిలో పరిష్కారం కాని సమస్యలు తన దృష్టికి తీసుకరావాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేతాజీ ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకం

• ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి


నేతాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జీఎమ్మార్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

కొత్తకోట, జూలై 1 : నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేతాజీ బ్రిటిష్ వారిని గడగడ లాడించి స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించాడన్నారు. అభివృద్ధిలో అందరం సహకరించుకోవాలని, పార్టీలకు అతీతంగా కలిసి పనిచేయాలని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి చెప్పడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ తన వంతుగా నియోజక వర్గానికి నిధులు కేటాయించి అందరికీ సహకరిస్తానన్నారు. అనంతరం జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మానికతో పాటు ఎంపీటీసీలను ఆయన శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వడ్డె శ్రీనివాసులు, చెన్నకేశవరెడ్డి, ప్రశాంత్, మల్లేశ్, కృష్ణారెడ్డి, బోయేజ్, శేషిరెడ్డి, గోపాల్‌నాయక్, గోవిందునాయుడు, లక్ష్మి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తకు ఎమ్మెల్యే బండ్ల పరామర్శ

పల్లె వెంకటన్నను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ధరూరు, జూలై 1 : మండలంలోని చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పరామర్శించారు. కూతురును పోగొట్టుకున్న బాధలో ఉన్న పల్లె వెంకటన్నను సోమవారం ఎమ్మెల్యే వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఆయన వెంట మార్లబీడు మాజీ సర్పంచ్ శ్రీరాములు, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ జంబు రామన్‌గౌడ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎంపీ రావుల పరామర్శ

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ రావుల

కొత్తకోట, జూలై 1 : కొత్తకోట మండలం కానాయపల్లికి చెందిన టీడీపీ నాయకుడు దారమోని గోపాల్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వడ్డె శ్రీనివాసులు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు హోటల్ రాజు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రాములు, నాయకులు కుర్మయ్య, వెంకట్‌కుమార్, ధనుష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

చట్టాల్లో మార్పులపై అవగాహన ఉండాలి

పెబ్బేరు, జూలై 1 : దేశంలో చేపట్టిన క్రిమినల్ చట్టాల మార్పులపై ప్రతి పౌరుడికి అవగాహన ఉండాలని శ్రీరంగాపురం ఎస్సై వెంకటేశ్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులతో సమావేశమై కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. మైనర్‌పై లైంగిక దాడి కేసులో నిందితులకు మరణ శిక్ష, గ్యాంగ్ రేప్ కేసులో 20ఏండ్ల జైలు శిక్ష పడే అవకాశాలు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదైన 90రోజుల్లో కేసుకు సంబంధించిన అప్‌డేట్స్ ఖచ్చితంగా నమోదు చేయాలని, కేసు విషయంలో మైనర్లు, మహిళలు, సీనియర్ సిటిజన్లు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేదని కొత్త చట్టం చెబుతుందన్నారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేస్తే ఏడాది జైలు శిక్ష, సంఘ సేవ పేరుతో చేసే తీవ్రమైన చర్యలకు కూడా శిక్ష పడుతుందని ఎస్సై తెలిపారు.

ఎన్టీఏ పరీక్షలను రద్దు చేయాలని ధర్నా

అయిజలో నిరసన తెలుపుతున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

అయిజ, జూలై 1: కేంద్ర ప్రభుత్వం ఎన్టీఏ పరీక్షలకు వెంటనే రద్దు చేయాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వెంకట్ డిమాండ్ చేశారు. సోమవారం అయిజ పట్టణంలోని కొత్త బస్టాండ్ కూడలిలో ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలతో ఆయన నిరసన తెలిపారు. నీట్ పరీక్ష పత్రాలను లీక్ చేసి ఎంతో మంది ప్రతిభ కలిగిన విద్యార్థుల జీవితాలతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆడుకుంటుందని విమర్శించారు. నీట్ పరీక్ష రద్దు విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ నిర్లక్ష్యపు వైఖరి వీడాలన్నారు. విద్యార్థుల భవిష్యత్‌పై బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. పదేండ్లుగా బీజేపీ హయాంలోనే ఏజెన్సీలు పరీక్ష నిర్వహణలో పూర్తి వైఫల్యం చెందాయన్నారు. దీంతో విద్యార్థుల బంగారు భవిష్యత్ ప్రశ్నార్థకంలో పడిందన్నారు. నీట్ పరీక్షల రాష్ట్రాల పర్యవేక్షణలో తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అలంపూర్ అధ్యక్షుడు ప్రకాశ్‌యోనా, చారి, నవాజ్, సూర్యచంద్ర, నరేశ్, విజయ్, రహీం, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం

కొత్తకోట,జూలై 1: మండల పరిధిలోని రాయినిపేట గ్రామంలో గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వంలో రూ. 20లక్షలు మంజూరు కాగా పూర్తయిన భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. అనంతరం కానాయపల్లిలోని దారమోని గోపాల్, తోకల రవిలు మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. వారి వెంట జితేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సురేందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మేస్త్రీ శ్రీను, ప్రశాంత్, గోకరయ్య, శేఖర్‌రెడ్డి, బీచుపల్లియాదవ్ పాల్గొన్నారు.

సేవలందిస్తేనే మంచి పేరు..

గట్టు, జూలై 1 : ప్రజాప్రతినిధులు మంచి సేవలందిస్తేనే వారికి ప్రజలు కలకాలం గుర్తుంచుకుంటారని ఎంపీపీ విజయ్‌కుమార్ అన్నారు. ప్రజాప్రతినిధులు పదవీకాలం ఈనెల 3వ తేదీన ముగియనుండడంతో జెడ్పీటీసీ, ఎంపీటీసీలను ఎమ్మెల్యే బండ్ల ఎంపీపీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం అన్నిశాఖల అధికారులను కూడా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యాభివృద్ధితోపాటు అన్నిరంగాల అభివృద్ధికి ఎంపీపీ కృషిచేశారని కితాబిచ్చారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు ఎంపీపీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాసు శ్యామల, వైస్ ఎంపీపీ సుమతి, పీఏసీసీఎస్ చైర్మన్ క్యామ వెంకటేశ్, ఐసీడీఎస్ సీడీపీవో కమలాదేవి, బీఆర్ఎస్ నాయకులు రామన్‌గౌడ్, బాసు హనుమంతు, అంగడి బస్వరాజు, ఆనంద్‌గౌడ్, రామకృష్ణారెడ్డి, రామునాయుడు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుడిపై దాడి

అమరచింత, జూలై 1 : ఇంట్లో విద్యుత్ సమస్య తీర్చడంలో ఆలస్యం చేశాడని మున్సిపాలిటీ కార్యాలయంలో విద్యుత్ కార్మికుడిగా పనిచేసే వ్యక్తిపై దాడి చేసిన ఘటన సోమవారం పట్టణంలో ఒకటో వార్డులో చోటు చేసుకున్నది. విద్యుత్ కార్మికుడి అల్లిపాషా కథనం ప్రకారం ఇంట్లో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు వచ్చాయని సరిచేయాలని చంద్రబాబు అనే వ్యక్తి ఆదివారం రాత్రి తనకు ఫోన్ చేయగా ఉదయం వచ్చి చూస్తానని చెప్పాను. అయితే సోమవారం ఉదయం పట్టణంలోని ఒకటో వార్డులో విద్యుత్ స్తంభంపై ఎక్కి లైన్ సరిచేస్తుండగా అక్కడికి వచ్చిన చంద్రబాబు తనపై అకారణంగా దాడిచేసి గాయపరిచాడని తెలిపారు. దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, తోటి సిబ్బందితో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఎర్రవల్లి ఎంఈవోగా అశోక్ కుమార్

ఎర్రవల్లి చౌరస్తా, జూలై 1: నూతన మండలంగా ఏర్పాటైన ఎర్రవల్లి చౌరస్తాకు ఎంఈవోగా అశోక్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. నూతన మండలం ఎర్రవల్లికి ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించడం సంతోషంగా ఉందని, మండల విద్యాభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని, అదే విధంగా పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచాలని సూచించారు.

బాధితులకు అండగా పోలీస్ శాఖ

• జోగుళాంబ గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల అర్బన్, జూలై 1 : శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ బాధితులకు అండగా ఉంటూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తోట శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజవాణి కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 16 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుదారుల నుంచి ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించి సమస్యలను పరిశీలించి ఆయా పోలీస్ స్టేషన్ అధికారులకు త్వరగా పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ పరిధిలోని ప్రతి అంశాన్ని చట్ట పరిధిలో పరిష్కరించడం, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి

వనపర్తి టౌన్, జూలై 1: బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ రక్షితా మూర్తి పోలీస్ అధికారులకు ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ ప్రజావాణి నిర్వ హించారు. ఫిర్యాదుదారులతో ఆమె స్వయంగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 12ఫిర్యాదులు అందాయని ఎస్పీ చెప్పారు.

ఉద్యోగోన్నతి పొందిన పోలీసులకు సన్మానం

వివిధ పోలీస్ స్టేషన్‌ల్లో పనిచేస్తూ ఉద్యోగోన్నతి పొందిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ రక్షితా మూర్తి అభినందించి బ్యాజ్‌లను అలంకరించారు. ఏఎస్ఐగా పదోన్నతి పొందిన శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్‌గా త పొందిన పరందాములు, మహేశ్, అవులయ్యను అభినందించారు.

వైద్య వృత్తి పవిత్రమైంది

గద్వాలటౌన్, జూలై 1 : వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని డాక్టర్లు కొనియాడారు. జాతీయ డాక్టర్స్ డే పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలో డాక్టర్లు 2 కే రన్ నిర్వహించారు. అనంతరం పలువురు డాక్టర్లు మాట్లాడుతూ వైద్యం కోసం దవాఖానకు వచ్చే రోగులు డాక్టర్లను దేవుడితో సమానంగా భావిస్తారన్నారు. అలాంటప్పుడు వారికి మెరుగైన చికిత్స అందించి అండగా ఉండటం మన బాధ్యతన్నారు. ఆరోగ్య సంరక్షణ, ప్రజారోగ్య రంగంలో డాక్టర్ రాయ్ వారసత్వం, వృత్తి నైపుణ్యం, మానవత విలువలను గౌరవించేందుకే జూలై 1వ తేదీని జాతీయ వైద్యుల దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే డీఎంహెచ్‌వో కార్యాలయంలో డాక్టర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో శశికళ, డాక్టర్లు మోహన్‌రావు, క్రాంతికుమార్, కిశోర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ వైద్య దినోత్సవం

కొత్తకోట, జూలై1 : జాతీయ వైద్యదినోత్సవాన్ని పట్టణంలోని పీహెచ్‌సీలో సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా టీఎస్ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ మాట్లాడుతూ కరోనా సమయంలో వైద్యులు చేసిన సేవలు మరువలేనివని ఎందరో ప్రాణాలకు ఊపిరి పోసిన మహనీయులు వైద్యులని వారి సేవలను కొనియాడారు. అంతకు ముందు డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్‌తో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారి వంశీ, జోషి, వైద్యాధికారిణి హసియాబేగం, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో 2కే రన్ నిర్వహిస్తున్న డాక్టర్లు

వైద్యులను సన్మానిస్తున్న టీఎస్ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు

సుంకేసుల డ్యాంలో దూకి వ్యక్తి ఆత్మహత్య

రాజోళి, జూలై 1: అనారోగ్య సమస్యలతో బటికి శ్రీనివాసులు(60) సుంకేసుల డ్యాంలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు, ఎస్సై జగదీశ్ కథనం ప్రకారం.. శ్రీనివాసులు కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడన్నారు. ఈయన చేనేత సంఘంలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం విధులకు తన కుమారుడు బస్వరాజు బైక్‌పై చేనేత సంఘం వద్ద వదిలి వెళ్లగా మధ్యాహ్నం 1గంట సమయంలో ఆటోలో వెళ్లి సుంకేసుల నదిలో దూకినట్లు కుటుంబ సభ్యులు, పోలీస్‌లకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని మృతిదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దరఖాస్తులకు ఆహ్వానం

గద్వాలటౌన్, జూలై 1 : జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇంటర్ విద్యాశాఖ జిల్లా అధికారి హృదయరాజు సోమవారం ప్రకటనలో తెలిపారు. గద్వాల జూనియర్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ పోస్టులు రెండు, గట్టు కళాశాలలో ఒక పోస్టు, అలంపూర్ జూనియర్ కళాశాలలో అర్థశాస్త్రం ఒకటి, మల్దకల్ కళాశాలలో జంతుశాస్త్రం ఒక పోస్టు ఖాళీ ఉందని తెలిపారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ పోస్టుకు నర్సింగ్‌లో 50శాతం మార్కులు సాధించి ఉండాలని లేకపోతే జనరల్ సబ్జెక్టులో యాభై శాతం, పీజీలో యాభై శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 4వ తేదీ వరకు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

చేపల వేట నిషేధం

వనపర్తి, జూలై 1: జిల్లాలోని శ్రీశైలం బ్యాక్ వాటర్ కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో చేపల వేట నిషేధించినట్లు సోమవారం ప్రకటనలో జిల్లా మత్స్యశాఖ అధికారి తెలిపారు. జూలై 1 నుంచి ఆగస్టు 31 వతేదీ వరకు శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో చేపపిల్లల బ్రీడింగ్ జరుగుతుందని, అందుకని కృష్ణానది పరివాహక గ్రామాల్లోని మత్స్యకారులు, లైసెన్స్ దారులకు చేపలు వేట నిషేధించినట్లు తెలిపారు. ఈ నిబంధనలు పాటించారని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ విషయాన్ని ఆయా గ్రామాల్లో చాటింపు వేయించాలని గ్రామ పంచాయతీలకు సూచించారు.

వరుణుడి కరుణకు పూజలు

మల్దకల్, జూలై 1 : వర్షాలు సకాలంలో కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ మండలంలోని అమరవాయి గ్రామానికి చెందిన ప్రజలు ఆదివారం రాత్రి జిల్లా కేంద్రం సమీపంలోని కృష్ణానదికి నీటి కోసం వెళ్లారు. నీటిని తీసుకొని గ్రామ సమీపానికి చేరుకోగా భజన భక్తులు, ప్రజలు వారికి భాజా భజంత్రీలతో స్వాగతం పలికారు. అనంతరం తెచ్చిన నీటితో గ్రామంలోని వీరభద్ర స్వామి ఆలయంలో స్వామివారికి అర్చకులు పాండు ఆధ్వర్యంలో జలాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అలాగే గ్రామ దేవతలకు నదీజలాలతో అభిషేకాలు చేశారు.

సంఘం లావాదేవీలపై దృష్టిపెట్టాలి

ఆత్మకూరు, జూలై 1: మహిళాసంఘంలో జరిగే ఆర్థిక లావాదేవీలపై ప్రతిఒక్కరూ దృష్టిసారించాలని ఏపీఎం వెంకట్ అన్నారు. మండలంలోని జూరాలలో సోమవారం జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంఘంలో నిర్వహించే ఆర్థిక లావాదేవీలపై సంఘంలోని సభ్యులందరికీ సమాచారం ఇవ్వాలని సూచించారు. సంఘం నుంచి ఖర్చుచేసే ప్రతి రూపాయి, సిబ్బంది వేతనాలు, ఈసీ సమావేశంలోనే తీర్మానాలు చేసి సభ్యులందరి ముందే చెక్‌లు ఇవ్వాలని తెలిపారు. నగదు లావాదేవీలన్నీ గ్రామ సంఘం ప్రతినిధులతో మాత్రమే చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంఘం ద్వారా వడ్డీలేని రుణాలు పొందిన లబ్ధిదారులు సకాలంలో రుణాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వీవో ఓబీ మహేశ్వరమ్మ, సీసీ అన్వర్ పాషా, వీవోఏ కురుమూర్తి, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై దృష్టి సారించాలి

వనపర్తి టౌన్, జూలై 1: జిల్లాలో స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై రవాణా శాఖ అధికారులు దృష్టి సారించాలని జిల్లా రవాణా శాఖ అధికారి మానసకు సోమవారం ఎస్ఎఫ్ఐ నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది మాట్లాడుతూ విద్యార్థులను తరలించే ఫిట్‌నెస్ లేని బస్సులను వెంటనే సీజ్ చేయడంతో పాటు విద్యాసంస్థల యాజమాన్యంపై కేసు నమోదు చేయాలన్నారు. బస్సులకు తప్పనిసరిగా ఫిట్‌నెస్‌తో పాటు ఇన్సూరెన్స్, ఫర్మిట్, డ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్స్, ఫైర్ సర్టిఫికెట్, ఫస్ట్ ఎయిడ్‌లను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి, జిల్లా కమిటీ సభ్యులు భరత్, సాయి, మహేశ్ ఉన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా చంద్రకళ

అలంపూర్, జూలై 1: అలంపూర్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా చంద్రకళ బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన జబ్బార్ పదవీ విరమణ పొందడంతో చంద్రకళకు జిల్లా అధికారులు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆమె గతంలో మండలంలో ఏంపీఈవోగా విధులు నిర్వహించారు. వన మహోత్సవంలో భాగంగా భీమవరంలో సోమవారం ఇన్‌చార్జ్ ఎంపీడీవో చంద్రకళ మొక్కలు నాటారు. నాటిన ప్రతిమొక్కనూ సంరక్షించుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు.

అభిప్రాయ సేకరణకే మహాజన సభలు

• డీఏవో గోవిందు నాయక్

అయిజ, జూలై 1: రైతు భరోసా పథకం అమలుకు రైతుల నుంచి అభిప్రాయ సేకరణ కోసమే మండలాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు డీఏవో గోవిందు నాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని సింగిల్ విండో కార్యాలయం ఆవరణలో రైతులతో సమావేశమయ్యారు. వ్యవసాయేతర భూములు, కొండలు, గుట్టలు, ప్లాట్లకు రైతుబంధు జమచేశారనే ఆరోపణల దృష్ట్యా రైతుల నుంచి అభిప్రాయాలు తెలుసుకుని ప్రభుత్వానికి అందజేస్తున్నట్లు తెలిపారు. రైతుల అభిప్రాయాల మేరకు రైతుభరోసా నిధుల విడుదలకు ప్రభుత్వం శ్రీకారం చుడుతుందన్నారు. రైతులు, కౌలు రైతులకు రైతు భరోసా అందజేయాలని, వ్యవసాయం చేయని రైతులకు రైతు భరోసా అందజేస్తే ఉపయోగంలేదని, 10ఎకరాల వరకు రైతు భరోసా అందజేయాలని, పెద్ద రైతులకు ఇస్తే దుర్వినియోగం అవుతుందని రైతులు వివరించారు. సమావేశంలో సింగిల్ విండో అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ఏవో శంకర్‌లాల్, కోఆపరేటీవ్ అసిస్టెంట్ రి